ప్రజాశక్తి

ఆదివారం 13 ఆగస్టు 2023

5

పార్వతీపురం మన్యం



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నాహాలు



రిహార్స్ చేస్తున్న పోలీసులు

పార్వతీపురం రూరల్ : ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం వేదిక కానుంది. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ తదితర ముఖ్య అధికారులు మైదానాన్ని పరిశీలించి వేడుకలకు అనుమతి తెలిపారు. దీంతో స్థానిక డిఎస్పి బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసుల కవాతు రెహార్స్ నిర్వహిస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. పోలీసు శాఖకు చెందిన పలు విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే కవాతులతో కూడిన గౌరవ వందనాన్ని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర స్వీకరించనున్నారు.

ఆలయ భూములు హాంఫట్

- కబ్జా కోరల్లో చంద్రశేఖర్ స్వామి ఆలయ స్థలాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆలయ భూమిలో నిర్మితమైన పక్కా భవనాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో నాగూరులో గల చంద్రశేఖర స్వామి దేవాలయ భూమి ఆక్రమణకు గురవుతోంది. ఉమ్మడి విజయనగరం జిల్లా దేవాదాయ శాఖ వారి పరిధిలో ఉన్నప్పటికీ ఈ దేవాలయం వైపు అధికారులు కన్నెత్తి చూకపోవడంతో ఆలయ భూములకు రెక్కలొచ్చాయి. ఈ దేవాలయానికి సంబంధించి మెట్టు, పల్లం భూములు కలిసి సుమారు మూడెకరాలున్నాయి. ఈ భూములను 2016 - 17లో లీజు కోసం వేలంపాట కార్యనిర్వాహణ అధికారి బుద్ధ మహాలక్ష్మి గణేష్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పుడు ఎవరు వేలం పాట పాడుకున్నారో వారి ఆధ్వర్యంలోనే ఇప్పటికీ భూములు సాగులో ఉన్నాయి. లీజు సమయమై ఐదేళ్లయినా అధికారులు దేవాదాయ శాఖకు ఎలాంటి రుసుము చెల్లించకుండా సాగులో ఉంచుకున్నారు. అలాగని దేవాదాయ శాఖ అధికారులు మళ్లీ వేలంపాట నిర్వహించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అదునుగా దేవాలయానికి చెందిన సుమారు ఎకరా విస్తీర్ణం కలిగిన జంగంమడిని ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది. ఈ విషయమై అధికారుల దృష్టికి వెళ్లినా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ జిల్లా అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణ స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టిన వారిపై సంబంధిత అధికారులు తగు చర్య తీసుకోవాలని కోరుతున్నారు. దేవుడు భూమికి రక్షణ లేకపోతే ఇక సామాన్యుల భూములకు రక్షణ ఏముంటుందని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

ఆక్రమణలు తొలగించే అధికారం దేవాదాయ శాఖకు ఉంది

2018లో హైకోర్టులో దేవాదాయ శాఖకు సంబంధించి వెలువడిన తీర్పులో లీజులు, కౌలు, ఆక్రమణకు సంబంధించి అనేకమైన కొత్త సవరణలు చేయడం జరిగింది. 83వ సెక్షన్ ప్రకారంగా లీజు గానీ, కౌలుకు, కాలం చెల్లిన వాటిని వెంటనే తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసుకునే చట్టాన్ని తయారు చేసింది. ఆక్రమణలు జరిగితే దేవాదాయశాఖ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకునేలా



చట్టం అవకాశం కల్పించింది. వారం రోజులు ముందుగా నోటీసు ఇచ్చి స్థలాలను ఖాళీ చేయించి భూములను రక్షించుకునే హక్కు కల్పించింది. అయినా దేవాదాయశాఖ అధికారులు చూసీ చూడనట్టు ఉండడం అనేది ఆశ్చర్యకరంగా ఉంది. వేలంపాట వేసి భూమి నుండి వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలి. అలాగే వేలం పాటలో అర్హత సాధించిన వారికి అప్పగించాలి.

కేతిరెడ్డి అశోక్
న్యాయవాది.

ఉన్న స్థలాన్నైనా కాపాడండి

దేవాలయానికి సంబంధించిన జంగం మడి భూమి ఆక్రమణకు గురైంది. ఇప్పటి వరకు సుమారుగా 80సెంట్లు విస్తీర్ణం కలిగిన భూమి ఆక్రమణకు గురైంది. మిగిలిన 40



సెంట్లు భూమిని దేవాదాయ శాఖ దృష్టి పెట్టి కబ్జా కోరల నుంచి కాపాడాలి. ఈ ఆలయ వ్యవహారాలను దేవాలయ శాఖ ఆధీనంలో తీసుకోవాలి.

అక్కినేని మధుసూదన్ రావు,
టిడిపి మండల నాయకులు

ఈ ఆలయం నా పరిధిలో లేదు

ఈ ఆలయానికి సంబంధించిన వివరాలు జిల్లా ఇన్స్పెక్టర్ అప్పాజెప్పడం జరిగింది. గతంలో వేలం వేయడం జరిగింది. ఆ తర్వాత నాకు తెలియదు.

బుద్ధ మహాలక్ష్మి గణేష్,
కార్యనిర్వహణ అధికారి





కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఉపాధ్యాయులు; ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎన్.వెంకటేశ్వర్లు

ప్రభుత్వం దిగిరాకుంటే ఉధృత పోరాటం

- ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వర్లు
- కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం దిగి రాక పోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని ప్యాప్టో రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్యాప్టో పిలుపు మేరకు శనివారం స్థానిక డిఇఒ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ఉపాధ్యాయులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద 12 గంటల ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు శ్మశాన వాటికలులా మిగిలాయిని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవోతో భవిష్యత్తులో 18వేల పాఠశాలలు మూతపడతాయని, ప్రాథమిక పాఠశాల అనేది భవిష్యత్తులో ఉండదని హెచ్చరించారు. అలాగే ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా అనర్హుడన్నారు. రాష్ట్ర ప్యాప్టో పరిశీలకులు గణపతి మాట్లాడుతూ సిపిఎస్ రద్దుచేసి మాట నిలబెట్టుకోవాలని అన్నారు. జిల్లా చైర్మన్ వి.ధనుంజయ నాయుడు ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలన్నీ చెల్లించాలన్నారు. ప్యాప్టో జిల్లా నాయకులు ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం చేయాలని, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యులు ధనుంజయ రావు, జిల్లా బాధ్యులు తోట రమేష్, పిసిహెచ్ శ్రీనివాసరావు, నల్ల బాలకష్ణ, గోవిందరావు, పైడిరాజు, అనిల్, జిల్లాలోని ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి



మృతి చెందిన ధరణి (ఫైల్)

ప్రజాశక్తి - కొమరాడ

డెంగీ జ్వరం బారినపడి ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం. కుమ్మరి గుంటకు చెందిన గనేడ ధరణి (11) డెంగీ జ్వరంతో గత వారం రోజులుగా శ్రీకాకుళం జిల్లా జిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మొదట్లో జ్వరం రావడంతో పార్వతీపురంలో గల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం ఆరోగ్యం మరింత క్షీణించడంతో శ్రీకాకుళంలోని జిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. అక్కడ గతికొద్ది రోజులుగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ పరిస్థితి విషమడంతో విద్యార్థిని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు గనేడ హర్నాధరావు దమయంతిల రోదనలు మిన్నంటాయి. ధరణి పాఠశాలలో చురుకుగా ఉంటూ కోలాటం నృత్యంలో చిన్న వయసులోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ధరణి మతితో కుటుంబ సభ్యులపాటు గ్రామంలో తీవ్ర విషాదఛాయలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గ్రామంలో తాగునీటి సమస్యతో పాటు కాలువలు న క్ర మం గా లేకపోవడంతో విష జ్వరాల బారిన పడు తు న్న ట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అపారిశుధ్యం తాండవించడం తోనే ప్రజలు రాగాల బారిన పడుతున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు హరి

మతోన్మాదాన్ని వ్యతిరేకిద్దాం

- రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకుందాం : ఎస్ఎఫ్ఐ
- ఐక్య విద్యార్థి ఉద్యమ జెండావిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

దేశంలో మతోన్మాదాన్ని ప్రతిఘటించి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఐక్య విద్యార్థి ఉద్యమ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక గిరిజన పోస్టుమెట్రిక్ బాలురు వసతిగృహంలో కమిటీ సభ్యులు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో కూడిన ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు పి.హరి మాట్లాడుతూ దేశంలో బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా, దేశానికి స్వాతంత్ర్యం కావాలని, సమసమాజం రావాలని, విద్యా, ఉపాధి అవకాశాలు అందరికీ దక్కాలని కోరుతూ జాతీయోద్యమంలో విద్యార్థులు చేసిన పోరాటాలు, త్యాగాలు మరువలేనిదని, స్వాతంత్ర్యం అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితాలు ఈనాడు కొద్దిమంది మాత్రమే అనుభవిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా దక్కలేదని, అసమానతలతో కూడిన భారతదేశంగా నేడు మిగిలిపోయిందని వాపోయారు. దేశ ప్రజల విముక్తికై బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టాలనే లక్ష్యంతో వివిధ విద్యార్థి, యువజన సంఘాలు నాయకుల వారసత్వంతో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. నేడు విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ పోరాటాల్లో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాస్టల్ ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు నవీన్, సురేంద్ర, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌బికెలో నగదు గోల్ మాల్?

ఆలస్యంగా వెలుగులోకి... • స్థానిక ఉద్యోగి చేతివాటం

ప్రజాశక్తి మక్కువ

మండలంలోని చెముడు రైతు భరోసా కేంద్రంలో రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించి సుమారు రూ.4.5 లక్షలు ప్రభుత్వ ఖాతాకు చేరకుండా తన సొంతానికి స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకుడు వినియోగించుకున్న అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులకు ఈ విషయం తెలిసినా గోప్యంగా ఉంచడం మరో విశేషం. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని చెముడు గ్రామ వ్యవసాయకుడుగా (విఎఎ) ఎం.ఆనంద్ విధులు నిర్వహిస్తున్నారు. జూలైలో ప్రభుత్వం నుండి ఆర్‌బికెకు సుమారు రూ.4.50 లక్షలు విలువ గల ఎరువులను రైతులకు విక్రయించారు. అయితే ఈ మొత్తాన్ని ఏ రోజుకారోజు వ్యవసాయ శాఖకు జమ చేయాల్సి ఉంది. కానీ ఈ నగదును విఎఎ సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఎరువులకు సంబంధించిన నగదు వ్యవసాయ శాఖ ఖాతాకు జమ కాకపోవడంతో అధికారులకు అనుమానం వచ్చింది. విచారణ కూడా చేపట్టారు. ఈ విచారణలో మొత్తం నగదును ఆ ఉద్యోగి సొంతానికి వాడుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. సంబంధిత ఉద్యోగికి ఇప్పటికే మెమోలు కూడా జారీ చేశారు. ఇదిలా ఉండగా రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే ఉండడంతో ఇలాంటి తప్పిదాలు జరుగుతూ వస్తుంటాయని పలువురు ఆక్షేపిస్తున్నారు. శాఖా పరమైన పొరపాట్లు పత్రికల్లో వార్తలు వస్తే ఉన్నతాధికారులు జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. వీరి వ్యవహారశైలి వల్లే ఇలాంటి అక్రమాలకు యథాతథంగా సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగిపై చర్యలు చేపట్టాం

రైతు భరోసా కేంద్రంలో ఎరువులకు సంబంధించిన నగదు మాయం కావడంతో దానికి బాధ్యుడైన ఉద్యోగి ఆనంద్ పై ఉన్నతాధికారులకు చర్యలు నిమిత్తం నివేదిక సమర్పించాం ఇప్పటికే రెండు మెమోలు కూడా జారీ చేశాం నగదును రికవరీ చేసేలా చర్యలు చేపట్టాం

శ్రీనివాసరావు, ఎఒ,

నగదు చెల్లించేశాం...

ప్రభుత్వానికి జమ చేయవలసిన నగదును కొన్ని కారణాల చేత సొంతానికి వాడుకోవడం నిజమే. నగదును ఇప్పటికే చెల్లించడం జరిగింది

ఎం.ఆనంద్, విఎఎ

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమే : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చుననే సంకేతాలు అందుతున్నాయని, అందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. శనివారం పట్టణంలోని శివాలయం వీధిలో సీతారామ ధర్మశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో గడపగడపకూ ప్రభుత్వం ముగింపు దశకు చేరుకున్న సందర్భంగా ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు జర్జాపు దీప్తి, వైసిపి సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని వారితో మమేకం కావడానికి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గొప్ప అవకాశమని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని 89 సచివాలయాల్లో 80వేల కుటుంబాలను కలిసే అవకాశం లభించిందన్నారు. మెంటాడ మండలంలో 17సచివాలయాల్లో పూర్తయిందని చెప్పారు. శనివారంతో పట్టణంలోని 14సచివాలయాల్లో పూర్తవుతుందని చెప్పారు. పాచిపెంట మండలంలో ఒకే సచివాలయం పూర్తి చేయాల్సి ఉందన్నారు. మక్కువ మండలంలో ఇంకా 9 సచివాలయాల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో 50వేల కుటుంబాలకు లక్షా 82వేల మందికి రూ.170కోట్ల 92లక్షల 98వేల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో 45వేల ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను పాటు పట్టణంలో రూ.14కోట్ల అభివృద్ధి పనులు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో రూ.7కోట్ల పనులు పూర్తయ్యాయని, ఆరు కోట్ల రూపాయల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇటీవల సిఎం జగన్ పర్యటనలో పట్టణ సీనియర్ నాయకులు కలిసినప్పుడు గిరిజన ప్రాంత మున్సిపాలిటీ అయినందున అదనపు నిధులు మంజూరు చేయాలని కోరగా ప్రతి సచివాలయానికి అదనంగా రూ.20లక్షలు చొప్పున మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. పట్టణంలో నాడు నేడు కింద రూ.9కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.5కోట్లు వరకు ఖర్చయ్యాయని చెప్పారు. నాలుగు దశాబ్దాలుగా పూర్తి కాని బైపాస్ రోడ్డును రూ.40కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.17కోట్లతో వందపడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతున్నదని చెప్పారు. త్వరలో 1056మందికి టిడ్కో గృహాలను అందజేయనున్నట్లు తెలిపారు. రూ.70కోట్లతోభారీ తాగునీటి ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని రాజన్నదొర చెప్పారు. సమావేశంలో కార్యక్రమంలో కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు హరి బాలాజీ, బి.శివప్రసాద్, పి.అప్పలస్వామి, చొక్కాపు గోపి, మద్దిల గోవిందరావు, పతివాడ శివ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గత వారం రోజుల నుంచి ఎండలు మండుతున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రత 34 డిగ్రీల వరకు నమోదు కావడంతో వర్షాకాలంలో వేసవి తలపిస్తోంది. జూలై చివరి వారంలో విస్తారంగా వర్షాలు కురిసినా ఆగస్టు నుంచి వర్షపాతం పూర్తిగా తగ్గింది. సరైన వర్షాల్లేక రైతులు ఖరీఫ్ పంటలు ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో నేటికీ పలుప్రాంతాల్లో వరి నాట్లు పూర్తి కాలేదు.

హామీలు అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు కార్యదర్శి ఎన్ వై నాయుడు విమర్శించారు. పట్టణంలో శనివారంనిర్వహించిన సిఐటియు సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులకు నష్టదాయకంగా ఉన్నాయన్నారు. గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అందరికీ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాల అమ్మకం, ప్రైవేటీకరణ, మానిటైజేషన్ విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. సంఘం పెట్టుకునే హక్కు, బేరసారాలాడే హక్కులను కాల రాయడం జరుగుతుందన్నారు. అసంఘటిత కార్మికులకు, స్కీం వర్కర్లందరికీ




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

ఉద్యోగ భద్రత కల్పించాలని, సామాజిక భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంలో వెనకాడడం సరైంది కాదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని, కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించి, వ్యవసాయ కార్మికులకు రూ.600 వేతనంపై కనీసం 200 రోజులు ఏడాదిలో పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్ టి.రాముడు, కమిటీ సభ్యులు వెంకన్న, భాస్కరరావు, స్వప్న, దేవి, సీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆవేదన వినిపించుకునేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చదువుతూ పోరాడు... చదువుకై పోరాడు అన్న నినాదంతో సాగిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర జిల్లాలో పది రోజుల పాటు సాగింది. గత నెల 31న ప్రారంభమైన యాత్ర 9వ తేదీ వరకు జిల్లాను చుట్టుముట్టింది. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో అనేక సమస్యలను ఎస్ఎఫ్ఐ బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలకు వెళ్లిన నాయకులు, కార్యకర్తలకు విద్యార్థులు అఖండ స్వాగతం పలికారు. రోజూ వేలాది మంది యాత్రలో భాగస్వామ్యమవుతూ తమ సమస్యలను నాయకుల ఎదుట ఏకరువుపెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. యాత్ర చివరి రోజు ఈనె 9వ తేదీన జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యాత్రలో గుర్తించిన సమస్యలను, విద్యార్థుల ఆవేదనను ప్రభుత్వం, ముఖ్యంగా జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కూడా రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనికితోడు ఆరు నెలలుగా ఛార్జీలు చెల్లించకపోవడంతో నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందుల నడుమ నెట్టుకొస్తున్నారు. చాలా చోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్లు నడుస్తున్నాయి. దీంతో, విద్యార్థులు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోలేదు. ప్రతి వార్డెన్ 2 నుంచి 3 హాస్టళ్లకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించడంతో విద్యార్థుల ఆలన పాలన, భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు అన్ని జూనియర్ కాలేజీల్లోనూ అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేరు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. గతంలోవున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని



ప్రభుత్వం తొలగించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాడు-నేడు నిధులు ఎటు పోతున్నాయో అంటూ జనంలో చర్చ నడుస్తోంది. అధ్యాపకులు, పాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో లేకుండా చదువులెలా సాగుతాయని కూడా ప్రశ్నిస్తున్నారు. దత్తిరాజేరు, మెరకముడిదాంలలో రెండేళ్ల క్రితం మంజూరు చేసిన జూనియర్ కాలేజీలకు ఇప్పటికే సొంత భవనాలు లేవు. అధ్యాపకులు అరకొరగానే ఉన్నారు. దీంతో, హాస్టళ్ల మాదిరిగానే మరుగుదొడ్లు, తాగునీటి సమస్య వెంటాడుతోంది. భోగాపురం, మెంటాడ, బొండపల్లిలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా ఎస్.కోట మండలం బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని కొన్ని భవనాలు తొలగించిన సంగతి తెలిసిందే. వాటికి సంబంధించి కొత్తగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఉన్నత కొద్దిపాటి గదుల్లోనే విద్యార్థులకు షిఫ్టులవారీగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్.కోట, గజపతినగరం డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలు లేకపోవడంతో కనీస సదుపాయాలు కూడా గగనమయ్యాయి. అధ్యాపకులు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురౌతున్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్శిటీకి కూడా సొంత భవనం లేకపోవడం వల్ల తరగతులు ఒకచోట, ప్రయోగాలు మరోచోట, హాస్టల్ ఇంకోచోట నడుస్తున్నాయి. దీనికితోడు జిల్లాలో పిజి క్యాంపస్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేకపోవడం పట్ల యాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు విస్తుపోయారు. మెజార్టీ హాస్టళ్లు, స్కూళ్లు, కాలేజీలలో కనీస సదుపాయాలు లేకపోవడం, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సరిపడినంత మంది లేకపోవడంతో నాడు - నేడు నిధులు ఏమౌతున్నాయో అన్న అనుమానాలు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులల్లో వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరుతున్నారు. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



అరటి తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

పూతికవలస - సీతంపేట గ్రామాల మధ్య ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కురుపాం మేజర్ పంచాయతీ పరిధిలోగల పూతికవలస, సీతంపేట గ్రామాల మధ్యలో ఏనుగుల గుంపు శనివారం సాయంత్రం సంచరిస్తూ అరటి, వరి పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీమంత రైతు కుటుంబాలమని, నిత్యం పొలాలకు వెళ్తూ, పొలం పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటామని ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతుల పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను దూర ప్రాంతాలకు తరలించే మా పంటలకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నామన్నారు.



మహిళలకు బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఏజెన్సీలో గడపగడపకు..

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిల్లాడ సచివాలయ పరిధిలో జయపురం, జయపురం గూడ, తాడిపాయి, గాడిదిపాయి, జలుబుగూడ, పొంగలంగూడ, చదునుగూడ, కుంకంమాను గూడ, రామయ్య గూడ, కిల్లాడ, గ్రామాల్లో "గడప గడప - మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వి.కళావతి ఆదివారంనిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్‌పిటిసి సవర రాము, ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్ రావు, సర్పంచులు కొండగొర్రి. సరోజినమ్మ, పూయిక సరస్వతి, కూరంగి. వెంకినాయుడు, బిడ్డిక లక్ష్మి, జీలకర్ర సుందరమ్మ, ఎంపిటిసి సభ్యులు కిల్లక గన్నమ్మ, నిమ్మక హరిప్రసాద్, ఎంపిడిఒ కె.సత్యం, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాడేది అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) అని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయ ఆవరణలో జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ ఎఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 87 సంవత్సరాలు పూర్తిచేసుకుని 88వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థి నాయకులకు, మాజీ నాయకులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి ఉద్యమ బావుట ఎఐఎస్‌ఎఫ్ అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, విద్యార్థి నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు

వారాహి యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

విశాఖపట్నం జిల్లా గాజువాకలో ఆదివారం జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ చేపట్టనున్న మూడో విడత వారాహి యాత్రను జయప్రదం చేయాలని జనసేన మండల నాయకులు ఎంపుండరీకం, వజ్రగడ రవికుమార్లు శనివారం ప్రకటనలో తెలిపారు . జనసేన కార్యకర్తల, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వారాహి యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు.



బ్లీచింగ్ జల్లిస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

పారిశుధ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పంచాయతీలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచి బి.గౌరీశంకరరావు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని వీధుల్లో ఉన్న మురికి కాలువలు, బోర్లు, బావుల వద్ద బ్లీచింగ్ పౌడర్ వేయించినట్లు తెలిపారు. అలాగే ప్రతిరోజు ఉదయం గ్రామంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద పెరిగిపోయిన చెత్తా, చెదారం తొలగించి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని, వీధుల్లో ఏర్పాటు చేసిన కుండీల వద్ద చెత్తను పారవేయాలని సూచించారు.

టిటిడిలో అన్నదానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో తూరాయిపువలస సమీపంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో శనివారం కొంతమంది దాతలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వెయ్యి మందికి అన్నదానం చేశారు. ముందుగా అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హాజరయ్యారు.

పట్టణంలో చెత్త శుద్ధి ఏదీ? : జనసేన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో చెత్త శుద్ధి ఏదని జనసేన నాయకులు ప్రశ్నించారు. జనసేన జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, తామరఖండి తేజ తదితరులు పట్టణంలోని రాయగడ రోడ్ శివారులో గల డంపింగ్ యార్డ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీని దశాబ్దాలుగా వేధిస్తున్న డంపింగ్ యార్డ్ తరలింపులో పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. మండలంలోని మరికి, రావికోన బట్టివలస, నర్సిపురం, కొన్నిడివరం తదితర ప్రాంతాలకు తరలిస్తామంటూ పాలకులు, అధికారులు ప్రజలను మభ్య పెడుతున్నారే తప్ప తరలింపు చేసే పరిస్థితి లేదన్నారు. ఈ తరలింపు పేరుతో స్థల సేకరణ, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే లక్షలాది రూపాయలు వృథా చేశారన్నారు. చెత్త డంపింగ్ యార్డ్ వల్ల సమీప జట్టు ఆశ్రమం, వివేకానంద కాలనీ, జగన్నాథపురం ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. అయితే చెత్తలో పొగ మంటలు, లేదంటే రోడ్డుపై కుప్పలు తదితర వాటితో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదన్నారు. మొత్తంగా పాలకులు, అధికారుల్లో చెత్తశుద్ధి లోపించిందని ఆరోపించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఓర్వలేకే మాజీమంత్రి ఆక్రోశం : టిడిపి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 9, 10తేదీల్లో జిల్లాలో చేపట్టిన పర్యటన విజయవంతమై, ప్రజాదరణ పొందడాన్ని చూసి ఓర్వలేకనే మాజీ మంత్రి, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆక్రోశం వెల్లగక్కుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి, కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగదీశ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉల్లిభద్ర, తోటపల్లి సందర్శనలో చంద్రబాబు తమను చిన్నచూపు చూశారని, మహిళలు వాహనంపై వేలాడి ఉన్నట్లు పత్రికల్లో రాయించడం పట్ల వారు స్పందించి మాట్లాడారు. తమ అధినేత చంద్రబాబుతో పాటు తమకు సమావేశ స్థలానికి వచ్చే గిరిజనులను అభివాదం చేయడానికి ఇచ్చిన అవకాశమని, దీన్ని చూసి ఆమెకు కడుపు మంట కలిగిందన్నారు. తమను ఆయన వాహనంలో ఎక్కించి, పక్కనే కూర్చోబెట్టి నియోజకవర్గ, జిల్లాలో సమస్యలను అడిగిన చంద్రబాబు నాయుడు తీరును వారు ప్రశ్నించడానికి అర్హులేకాదన్నారు. జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్యేలు గిరిజన సంక్షేమశాఖ మంత్రులుగా పనిచేసిన ఒక్కసారిగా ఐటిడిఎ మీటింగులు పెట్టిన దాఖలాల్లేవన్నారు. ఐటిడిఎలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయితప్ప వాటికి నిధులు కేటాయించిన దాఖలాల్లేవన్నారు. వైసిపి ప్రభుత్వంలో అత్యంత విలువైన పదవులు సలహాదారుల్లో దళిత, గిరిజనుల్లో ఒకరికైనా ఇచ్చారా అని వారు ప్రశ్నించారు. ఇటీవల జిల్లాలో సిఎం జగన్ పర్యటనలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న రాజన్నదొరకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం అందరికీ తెలిసిందేనన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో పాటు పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా, మన్యం జిల్లా పార్టీకి అధ్యక్షురాలిగా తనను చంద్రబాబు నియమించిన అంశాన్ని సంధ్యారాణి గుర్తు చేశారు. టిడిపి అధినేత అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ ఫోన్ చేసిన తమతో మాట్లాడతారని, వైసిపి అధ్యక్షులు జగన్ దళిత, గిరిజన ఎమ్మెల్యేలకు అపాయింట్ కూడా ఇవ్వరని ఎద్దేవా చేశారు. గిరిజన మంత్రిగా ఉన్న సమయంలో తన నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో పాము కాటు వల్ల ఒక విద్యార్థి చనిపోయిన, ఇటీవల మరోపాఠశాలలో మరో విద్యార్థికి పాముకాటు వేయడం చూస్తే నాడు-నేడు ద్వారా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి ఏమిటని వారు ప్రశ్నించారు. ఇటీవల సిఎం మీటింగుకు విద్యార్థులను, తల్లిదండ్రులను పెద్ద ఎత్తున తీసుకొని రాగా, తమ అధినేత మీటింగుకి ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. అన్ని రంగాల్లో వైసిపి ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని, అన్నిచోట్ల దీనిపైనే ప్రజలు చర్చించుకుంటున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సిపి గద్దెదిగడం ఖాయమని తెలిపారు. ఇదిగో అదిగో పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తి చేస్తామని ప్రకటనలు చేయడం తప్ప అక్కడ ఒరిగిందేమి లేదన్నారు. మరోపక్క గుమ్మడిగెడ్డ తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఇటీవల కాలంలో గడప గడపకు కార్యక్రమాల్లో పుష్పశ్రీవాణికి గిరిజనులే ఎదురు తిరుగుతున్నారని తెలిపారు. ఇటీవల చొల్లపదంవద్ద నాగావళి నదిని దాటడానికి ఎదురుకర్రలతో కుమార్తె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో గిరిజన కుటుంబం పడే కష్టాన్ని గుర్తించాలని సూచించారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో కురుపాం నియోజక వర్గంలో జరుగుతున్న పూర్ణపాడు వంతెన పూర్తిచేసే చర్యలు తీసుకోవడం లేదన్నారు. మీ ఇంటిని మీరు సరిచేసుకొని మాఅధినేతపై, మాపై విమర్శలు చేయండని అన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రవి కుమార్, కొల్లి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో గల వెంకటేశ్వర స్వామి, కోదండ రామస్వామి వారి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం అధిక శ్రావణ ఏకాదశి ప్రమాణ స్వీకారం చేశారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సమక్షంలో తోటపల్లి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మర్రాపు సత్యనారాయణ , ధర్మకర్తలుగా బోను వాగ్దేవి, మార్కొండ నారాయణమ్మ, నందివాడ కనకమహాలక్ష్మి, కునుమూరు సాగర్, బుడ్డేపు ఇందుమతి, గంట్యాడ సింహాచలం, పళ్ళ పాపమ్మ, గౌరీ శంకర్ పాత్రో, ఎక్స్ అఫీషియో సభ్యులుగా, వివి అప్పలాచార్యులును ఆలయ కార్య నిర్వహణ అధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు మరిశర్ల బాపూజీ నాయుడు, కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి, పార్వతీపురం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయ ప్రకాష్ నారాయణ (జయబాబు), తోటపల్లి గ్రామ పెద్దలు ఆవాల కన్నయ్య, డోల్లు పారినాయుడు, మాజీ ఎంపిపి ద్వారపురెడ్డి ధనుంజయరావు, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్ చేతబూని ప్రచారం చేస్తున్న వంతెన సాధన కమిటీ సభ్యులు

రిలే దీక్షలకు గిరిజనుల తరలిరావాలి

వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో సంతలో ప్రచారం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గిరిజనులకు ఎంతో అవసరమైన పూర్ణపాడు-లాబేసి వంతెన పనులు ప్రారంభించాలని కోరుతూ తలపెట్టనున్న రిలే నిరాహార దీక్షలకు గిరిజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని వంతెన సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. శనివారం కూనేరు సంతలో వంతెన సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సంతలో నిరాహారదీక్షల పోస్టర్లను పట్టుకొని ప్రచారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు సాంబమూర్తి మాట్లాడుతూ ఇప్పటికైనా మన పాలకులు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే కాంట్రాక్టర్‌ను రప్పించి వంతెన పనులు పున: ప్రారంభించాలని కోరుతూ ఈనెల17 నుంచి 26 వరకు కోమట్లపేట వద్ద రిలే నిరార దీక్షలు, 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ప్రచారంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

కెజిబివికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సమీపాన కస్తూర్బా గాంధీ విద్యాలయానికి రాష్ట్రస్థాయిలో అరుదైన అవకాశం లభించిందని ఎస్ఒ సిహెచ్ రోహిణి విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించడంతో ఈ విద్యాలయానికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్టు తెలిపారు. ఇంతటి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యాలయం ఉపాధ్యాయులకు, సిబ్బందికి, తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వేటుపడినా ఫలితాలు తగ్గలేదు

ఈ ఏడాది ఏప్రిల్ 20న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కెజిబివిని ఆకస్మిక తనిఖీ చేసి ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని నెపంతో ఎస్ఒ సిహెచ్ రోహిణి, జిసిడిఒ కె.రోజారమణి, ఎంఇఒ కె.కృష్ణమూర్తి, డిఇఒ రమణను సస్పెండ్ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. విద్యాశాఖ అధికారులపై వేటు పడినప్పటికీ పదో తరగతి ఫలితాల్లో కెజిబివి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి తమ సత్తాను చాటుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర కౌన్సిలర్ ఐ.రాజమణి, జిల్లా కార్యదర్శి కె.గోవిందమ్మలు, కెజిబివి విద్యాలయానికి చేరుకుని శతశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోనే 352 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వీరఘట్టంలోని కెజిబివి ప్రథమ స్థానం సాధించింది. అంటే ఉపాధ్యాయుల కృషి విద్యార్థులపై ఎంత ఉందో వీటికి నిదర్శనం.



అవార్డుల పంట

2020- 23 విద్యా సంవత్సరంలో కెజిబివి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో కెజిబివికి అవార్డుల పంట లభించింది. ఆణిముత్యాలు పేరిట జిల్లాస్థాయిలో కె.రేణుకకు రూ.30వేలు, పి.వాసదేవికి రూ.15 వేలు నగదుతో పాటు నగదు సర్టిఫికెట్లు అందజేశారు. మండల స్థాయిలో రేణుకకు రూ.3వేలు, పి.వాస దేవికి రూ.2వేలు, సార రోజాకు వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. రాష్ట్రంలోనే వీరఘట్టం కెజిబివికి ప్రత్యేకత లభించడంతో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే వేడుకల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయనున్నారు..



యువతతో మాట్లాడుతున్న టిఆర్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ

గిరిజన యువతకు వృత్తి శిక్షణ నిర్వహించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఐ.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలో నీలకంఠాపురంలో యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమమార్గంలో నడిచి ఉన్నత చదువు చదివితే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కావున యువత అంతా చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని అన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లయితే వారు ఎంతో కొంత ఆర్థికంగా అభివృద్ధి చెంది స్థిరపడతారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక యువత మీనక వసంత, ప్రవీణ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

బెలగాం : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో యువతకు అవగాహన సదస్సు స్థానిక ఆశాజ్యోతి ఆశ్రమంలో శనివారం నిర్వహించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం గురించి ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి యువత కోసం చేపట్టిన ప్రపంచ కార్యాచరణ పట్ల అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. మొదటి అంతర్జాతీయ యువజన దినోత్సవం 2000 ఆగస్టు 12లో జరిగిందని, ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం వల్ల యువత దృష్టిని ఆకర్షించడం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. సాంస్కృతిక, చట్టపరమైన సమస్యల ద్వారా అపాయంలో ఉన్న ప్రజలకు ఇటువంటి దినోత్సవం అవసరం ఉందని శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు చిలుకూరి జగదీష్, చుక్క చందర్రావు, బోటు రామకష్ణ పాల్గొన్నారు.

టిడిపిలో అసంతృప్తి గళం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా బోనెల విజయ్ చంద్ర నియామకం పట్ల కొంతమంది నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఆ పార్టీ నాయకులు గర్భాపు ఉదయభాను అసంతృప్తి గళం వినిపించారు. పార్టీలో ఏ పని చేయాలన్నా సర్వేలు నిర్వహించే అధినాయకుడు చంద్రబాబు కొత్త ఇన్చార్జి నియామకం విషయంలో ఎలాంటి సర్వే నిర్వహించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొత్త ఇన్చార్జి నియామకం చేసేటప్పుడు కనీసం పార్టీని నమ్ముకుని ఉన్న ఆశావహులను సంప్రదించి ఉంటే బాగుండేదని, ఎంతోమంది ఈ పార్టీలో ఉంటే భవిష్యత్తు ఉంటుందని ఎంతో డబ్బు ఖర్చు చేసి పార్టీకి సేవలు అందించారని అన్నారు. అటువంటి వారికి పార్టీ కనీస న్యాయం చేయకపోవడం అన్యాయమని అన్నారు. పార్టీకి రాజీనామా చేసి వేరే పార్టీలోకి వెళతారా అన్న ప్రశ్నకు పార్టీలోనే ఉంటానని, తన భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందని తెలిపారు.

వాలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటీరు పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ కార్యాలయం ఎఒ ఎస్.రమేష్ అన్నారు. శనివారం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం అభ్యర్థి దరఖాస్తులతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాలను స్క్రూట్నీ చేశారు. మండలంలోని చోళపదం, పెద్దశాఖ, కొమరాడ, మాదలింగి, కెమిశిల, దుగ్గి గ్రామపంచాయతీలో ఒక వాలంటీరు పోస్ట్ చొప్పున, గంగిరేగువలస పంచాయతీలో-2 ఖాళీలు ఉన్నాయని అన్నారు. వివిధ సచివాలయ పరిధిలో ఖాళీలు ఉన్న 8 వాలంటీర్ పోస్టులకు 23మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తులో పరిశీల అనంతరం ఇంటర్వ్యూలతో పాటు ఎంపికైన వారి వివరాలను ఆదేశాల మేరకు ప్రకటన తెలియజేస్తామని తెలిపారు. ఈనెల 14న వాలంటీర్ల నియామకం, 15 సిఎఫ్‌ఎంఎస్‌ఐడిలు క్రియేట్ చేసి వాలంటీర్లు జాయిన్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.

గుర్తించిన సమస్యలకు సత్వర పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వార్డుల్లో గుర్తించిన సమస్యలకు సత్వర పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం నా అడుగు మీ కోసం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 29, 2 వార్డుల్లో ఆయా వార్డుల కౌన్సిల్ సభ్యులతో కలిసి వార్డు సందర్శన చేసి ప్రజలకు అవసరమైన శానిటేషన్, కాలువలు, రోడ్లు, మంచి నీరు సరఫరా, వీధుల్లో పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెలుసుకుని తమ దృష్టికి తెచ్చిన ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సైతం అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వార్డుల్లోని సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకొనేందుకు మీముందుకు రావడం జరిగిందని అన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు వార్డులను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు యడ్ల త్రినాథ, మంత్రి ఉమామహేశ్వరి, రణభేరి చిన్నం నాయుడు, రణభేరి బంగారు నాయుడు, సువ్వాడ లావణ్య, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కో ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు, నాయకులు బత్తుల శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, సరివిశెట్టి శ్రీనివాసరావు,, వివిధ వార్డుల సచివాలయం కన్వీనర్లు, గృహసారధులు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న స్థానికులు

కిల్లాడలో ఆజాదికా అమృత్ మహోత్సవ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కిల్లాడలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి-నా దేశం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ప్రారంభించి నాభూమి నాదేశం ప్రతిజ్ఞను చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందరో మహానుభావులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఎందరో మహనీయుల త్యాగఫలం వల్లేనని, మనమంతా స్వేచ్ఛగా జీవిస్తున్నామని, అలాంటి మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము, ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు మొదటి దశ పూర్తి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మిషన్ ఇంద్ర ధనుష్ మొదటి దశ టీకా కార్యక్రమం శనివారంతో పూర్తయిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. పట్టణ శివారు ఎదురువలస వద్ద వలస కార్మికుల నివాస ప్రాంతాలను, వెంకంపేట, నర్సిపురంలో మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. వలస కార్మికులతో మాట్లాడి వారి పిల్లల వయస్సుకు తగ్గ వ్యాధి నిరోధక టీకాలు వేయబడినవి, లేనివీ పరిశీలించి ప్రస్తుతం వారికి ఏఏ టీకాలు వేశారో వైద్య సిబ్బందిని ఆరా తీశారు. వారి టీకా కార్డులను పరిశీలించి పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే అక్కడ పిల్లల ఆరోగ్యం పరిశీలన చేసి, అవసరమైన మందులు, ఐరన్ సిరప్‌లను అందజేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో శత శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా గత సోమవారం ప్రారంభమైన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమం ఆరు రోజులుగా కొనసాగుతూ నేటితో మొదటి దశ పూర్తి కావచ్చిందని అన్నారు. జిల్లాలో350 సచివాలయాల పరిధిలో 715 వ్యాక్సిన్ సెషన్స్‌లో సుమారుగా 1500 మంది పిల్లలకు, గర్భిణీ లకు టీకాలు వేశామన్నారు. ఇందులో ముఖ్యంగా టీకా వేయబడని వారిని, వలస కార్మికుల నివాసితులు, ఇటుక బట్టీ నివాసితులు, హైరిస్క్ ప్రాంతాల్లో లక్ష్యంగా టీకాలు వేశామన్నారు. వీరితో పాటు ప్రతి బుధ, శని వారాల్లో టీకాలు వేశామన్నారు. పూర్తి చేసిన టీకా వివరాలన్నీ యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మిషన్ ఇంద్ర ధనుష్ రెండవ దశ సెప్టెంబర్‌లో, మూడో దశ అక్టోబర్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు జయగౌడ్, నాగమ్మ, ఎఎన్ఎంలు శాంతి, రత్నం, ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు శ్రావణి సంధ్య, ఉషశ్రీ, రాజశ్రీ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



వలస కార్మిక మహిళలకు టీకాల ప్రాధాన్యతను వివరిస్తున్న డిఐఒ జగన్మోహనరావు